క్లుప్తంగా

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ



శిక్షణా కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

చిట్వేలి : విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, ఆత్మస్థైర్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం కోసం ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసినట్లు ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ శిక్షణా శిబిరంలో తెలియజేసిన పాఠాలను జీవితంలో పాటించాలన్నారు. కార్యక్రమంలో హవాల్దార్‌లు సమయసింగ్, ప్రకాష్, ప్రమోద్, ఉపాధ్యాయులు చంద్రయ్య, దుర్గరాజు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



మూలవిరాట్‌లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో నిర్మించిన కోదండ రామాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం ప్రాతఃకాల పూజ, యంత్రపూజ, అభిషేక పూజలనంతరం మూలమూర్తులను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యుడు రామాంజులరెడ్డి

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కడప నగరం నాగరాజుపేటలోని శ్రీకర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ రామాంజుల రెడ్డి మాట్లాడుతూ ఈ మెగా ఉచిత వైద్య శిబిరంలో ఆస్తమా, దగ్గు, ఆయాసం, క్షయ, నెమ్ము, అలర్జీ, రక్తం పడుట, జలుబు, థైరాయిడ్, కీళ్లనొప్పులు వంటి దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులను అందజేశామన్నారు. కార్యక్రమంలో డీసీఎం బాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు నోటీసు

సంబేపల్లె : మండల పరిధిలోని దేవళంపేట అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్తగా పని చేస్తున్న కె. సరస్వతికి దేవపట్ల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ షోకాజ్ నోటీసు జారీ చేశారు. వివరాలు.. దేవళంపేట గ్రామంలో ఉండే అమీర్ బాషా ఫిర్యాదు మేరకు అంగన్‌వాడీ వర్కర్‌గా పని చేసే సరస్వతి విధి నిర్వహణలో అలసత్వం, సెంటర్ నిర్వహణ సమయం పాటించకపోవడం, ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందజేయడంలేదంటూ ఆయన ఆరోపించారు. దీంతో ఈ మేరకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆమెకు నోటీసు జారీ చేసి మూడు రోజుల్లో సరైన వివరణ ఇవ్వాలని కోరారు. వివరణ ఇవ్వని పక్షంలో ఆమెపై చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : క్రీడలతో ప్రజలకు మానసిక ఉల్లాసం కలుగుతుందని కడప డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా నగరంలో పోస్టల్ సిబ్బంది 5కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా ప్రజలకు ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం వేళల్లో వ్యాయామం తప్పని సరిగా చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ గణేష్, గోపాల కృష్ణ, రవికాంత్, రహమతుల్లా ఖాన్ పీఎల్ఐ డెవలప్‌మెంట్ మేనేజర్ మునాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల ఆట-పాట

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై స్థానిక నరసింహా డ్యాన్స్ అకాడమి విద్యార్థులు తమ ఆటపాటలతో సందడి చేశారు. సామాజిక అంశాలపై పలు కామెడి స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పలు ప్రాచుర్యం పొందిన సినీ గీతాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బడి మారింది.. భవిత మారనుంది

సర్కారు పాఠశాలలు శిథిలావస్థకు చేరి, చినుకు రాలితే ఎక్కడ పెచ్చులూడుతుందనే భయంతో బిక్కుబిక్కుమంటూ ఉండే రోజులు గత ప్రభుత్వాలలో కనబడేవి. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు అధిక నిధులు వెచ్చించి పాఠశాలల రూపురేఖలు మార్చడంతోపాటు ఆంగ్ల మాధ్యమాన్ని తీసుకొచ్చారు. అంతేకాకుండా డిజిటల్ విధానంలో బోధన అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులతో పోటీపడి విద్యను అభ్యసిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖర్చుకు వెనుకాడకుండా ప్రభుత్వ విద్యా విధానాన్ని బలపరుస్తుంటే విద్యార్థులు సీఎం పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా తమ సత్తాను చాటుతున్నారు. సెప్టెంబర్ నెలలో న్యూయార్క్ వేదికగా ఐక్య రాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగే ఎడ్యుకేషన్ ఫోరంలో రాష్ట్రానికి చెందిన పది మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నారు. గత ప్రభుత్వంలో సర్కారు పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపకుండా ఉండడం నుంచి నేటి జగన్ సర్కార్‌లో సీట్లు నిండుకోవడం వరకు చేరిందంటే ప్రజల్లో ప్రభుత్వ విద్యపట్ల ఎంత నమ్మకం ఏర్పడిందో చెప్పవచ్చు.

– ఒంటిమిట్ట





పాఠశాల రూపురేఖలు మారిన దృశ్యం





పెన్నపేరూరు ఎంపీపీ పాఠశాలకు నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడ



చిన్నకొత్తపల్లె ఎంపీపీ పాఠశాలలో మరుగు దొడ్లను అభివృద్ధి చేసిన దృశ్యం



చిన్నకొత్తపల్లె ఎంపీపీ పాఠశాలలో కారిడార్‌లో చదువుకుంటున్న విద్యార్థులు



ఒంటిమిట్ట మండలం రామచంద్రాపురం ఎంపీపీ పాఠశాల మారిన స్వాగత తోరణం

అతిథి గృహ నిర్మాణానికి భూమిపూజ

- ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో చేపడుతున్న నిర్మాణం
- పాల్గొన్న తితిదే చైర్మన్ భూమన, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరులు



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న తితిదే చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి

రాజంపేట : తిరుమలలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత మేడా రఘునాథరెడ్డిల ఆధ్వర్యంలో నిర్మించనున్న నూతన అతిథి గృహ పనులకు శనివారం తితిదే చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి భూమి పూజ చేశారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో చైర్మన్‌తోపాటు ఈఓ ధర్మారెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మేడా మధుసూదన్‌రెడ్డిలు పాల్గొన్నారు. తిరుమలలోని ఎంబీసీ సమీపంలో శ్రీవారి మెట్టు కాలిమార్గం దగ్గర ఈ అతిథి గృహం నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడా 'సాక్షి'తో మాట్లాడుతూ మా కుటుంబానికి అన్ని వేళలా శ్రీవారి ఆశీస్సులు మెండుగా ఉన్నాయన్నారు. అలాగే స్వామి వారి కృప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుష్కలంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మేడా కుటుంబసభ్యులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సిద్దవటం : సిద్దవటం కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 9వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు, ఫిర్యాదుదారులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దవటం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాసకళ్యాణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయాధికారిక సేవా సంస్థ సూచనల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం సాధ్యమవుతుందన్నారు. ఇందులో క్రిమినల్, సివిల్ కేసులతోపాటు రాజీకి ఆమోదయోగ్యమైన అన్ని రకాల కేసులను పరిష్కరించుకోవచ్చునన్నారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైన కేసుల్లో పొందిన అవార్డు కాపీ అప్పీలు రహితమన్నారు. సిద్దవటం కోర్టు పరిధిలోని అట్లూరు, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

అధిక ధరలకు వ్యతిరేకంగా సీపీఎం సమరభేరి

మదనపల్లె : అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలతో ప్రజలను దోచుకుతింటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమరభేరి పేరుతో ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక టమాటా మార్కెట్‌యార్డు ముందు సీపీఎం సమరభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. కేంద్రం విధిస్తున్న షరతులకు తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు భారం మోపుతోందన్నారు. ప్రపంచ బ్యాంకు షరతులను కేంద్రం అమలు చేస్తూ రాష్ట్రాలపైనా రుద్దుతోందన్నారు. రాష్ట్రం అప్పుల కోసం కేంద్రం విధించిన షరతులన్నీ అమలుచేస్తోందని, దీనివల్ల సామాన్యప్రజలపై మోయలేని భారాలు పడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యుత్‌చార్జీల విషయంలో రాష్ట్రప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందన్నారు. పెద్ద ఎత్తున భారం పడుతుండటంతో పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. అధిక ధరలకు, ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు జిల్లావ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు. 30,31 తేదీల్లో ప్రచారం, సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న సచివాలయాల్లో వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. 4న అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏ.వెంకటేష్, నాగరాజు, రామకృష్ణ, భాస్కర తదితరులు పాల్గొన్నారు.

సుగుణాల పట్ల ప్రేరణ కల్పించేందుకే పర్వదినాలు

కడప కల్చరల్ : సుగుణాల పట్ల మనిషికి ప్రేరణ కల్పించేందుకే పర్వదినాలు ఉన్నాయని బ్రహ్మకుమారీ అక్కయ్యలు అన్నారు. ఆదివారం స్థానిక ఓం శాంతినగర్‌లోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం కార్యాలయంలో రక్షాబంధన్, శ్రీకృష్ణాష్టమి ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ ఆంధ్ర, కర్ణాటక సబ్ జోన్ ఇన్‌చార్జి రాజయోగిని బీకే లీలా దీది ఇతర అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవుని మనసుకు జ్ఞానం, శాంతి, ప్రేమ, సంతోషం, శక్తి కావాల్సి ఉందని, మానవతా విలువల ద్వారా వాటిని సాధించుకోవచ్చని తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక సబ్ జోన్ అదనపు ఇన్‌చార్జి, జిల్లా కో ఆర్డినేటర్ రాజయోగిని బీకే గీతా దీది రక్షాబంధన్ వెనుకగల ఆధ్యాత్మిక రహస్యాన్ని వివరించారు. కార్యక్రమానికి ఆర్టీసీ డీపీటీఓ గోపాల్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే పీడబ్ల్యుఐ వెంకటేశ్వరరావు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ఆధ్యాత్మిక గీతాలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంస్థకు చెందిన పలు సేవా కేంద్రాల నుంచి 25 మంది బ్రహ్మకుమారీ ఉపాధ్యాయులు, 200 మందికి పైగా బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖలో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు గత మూడు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని వారికి వెంటనే జీతాలను చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాళ్లపల్లి అబ్దుల్లా డిమాండ్ చేశారు. పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్-1938) రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఆదివారం జిల్లాశాఖ ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌లను వెంటనే రద్దు చేసి ఓపీఎస్ మాత్రమే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు శివరామకృష్ణారెడ్డి, కమాల్‌బాషా, నరసింహులు, సిద్దయ్య, నాగరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పొలిమేర దేవర

వాల్మీకిపురం: పట్టణ పడమర పొలిమేర్లలో ఆదివారం పొలిమేర్ల దేవరను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం మంగళ వాయిద్యాల నడుమ పూజా సామగ్రితో పొలిమేర్ల వద్దకు చేరుకొని గంగమ్మకు విశేష పూజలు నిర్వహించి, వర్షాలు కురవాలని అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాభిషేకం తదితర విశేష కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పొలిమేర్లలో పడి ఉన్న పాత రోళ్లు, ఇసుర రాళ్లు తదితర వాటికి పూజలు నిర్వహించి తూర్పు పొలిమేర వద్దకు తరలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాత రోళ్లు, ఇసుర రాళ్లను సైతం ట్రాక్టర్లలో తరలించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం అశేష భక్తజనసందోహంతో కిటకిటలాడింది. శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు చేశారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.

కలకడలో పర్యటించిన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

కలకడ : ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మండలంలోని కె.బాటవారిపల్లె, కలకడ, కదిరాయచెర్వు, నడిమిచెర్ల, గుడిబండ పంచాయతీలలో పర్యటించారు. ఆదివారం సాయంత్రం కె.బాటవారిపల్లె మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళ్ళు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కలకడ మాజీ సర్పంచ్ ఫైరోజషబ్బీర్‌అహమ్మద్ ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం కదిరాయచెర్వు లోని మాజీ సింగల్‌విండో అధ్యక్షులు మల్లికార్జునసెట్టి చిత్రపటానికి నివాళి అర్పించారు. అలాగే నడిమిచెర్ల పంచాయతీలోని మాజీ సర్పంచ్ రాజారెడ్డి, నాగమోహన్‌రెడ్డిలను పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్రమ్మను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు పాత్తూరి శ్రీకాంత్‌నాయుడు, కోటి, విశ్వనాథ్‌శెట్టి, వెంకట్రమణ, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతంపై దిశానిర్దేశం

కలికిరి: క్షేత్ర స్థాయిలో బీజేపీ బలోపేతంపై ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా కలికిరికి విచ్చేసిన ఆయన స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆదివారం పుంగనూరు, పీలేరు, రాయచోటి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు అవలంభించాల్సిన కార్యచరణను వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్లాలని ఆదేశించారు.

మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్‌కు పరామర్శ

కలికిరి: మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి ఇటీవల నగిరిపల్లిలోని తన నివాసం వద్ద ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డారు. చికిత్స అనంతరం విశ్రాంతి పొందుతున్న ఆయనను ఆదివారం రాత్రి రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి పరామర్శించారు. ఆరోగ్యంపై శ్రద్ధవహించి త్వరగా పూర్తి స్థాయిలో కోలుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో భక్తిభావం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : ఆలయాల నిర్మాణంతో సనాతన ధర్మం పెంపొందుతుందని అన్నమయ్యజిల్లా వైఎస్‌ఆర్‌సిపి అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోటశ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ ముదినేని వడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. అనంతరం గ్రామ సమస్యలపై నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, బీసీ నాయకుడు నాగరాజుయాదవ్, నాయకులు అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

'మానవత' సేవలు అభినందనీయం



చిట్వేలి: సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాయచోటి టౌన్ : మానవత సంస్థ సేవలు అభినందనీయమని రాయచోటిలోని జేసీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యజమాని జయప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని కొత్తపేటలో ఉన్న ప్రతిభా జూనియర్ కళాశాల ఆవరణలో మానవత సంస్థ సేవా సంస్థల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలలో మానవత సేవలు జరుతున్నాయన్నారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సలహాదారు వెంకరమణ, వెంకటరమణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేవలు విస్తృతం చేయాలి

చిట్వేలి : సమాజ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని మానవత సంస్థ బాధ్యులు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక సాయి వికాస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం మానవత నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాలలో చెట్లను నాటారు. అనంతరం సభ్యత్వాల సమోదుపై సమీక్షించారు. రాబోయే రోజుల్లో చేయాల్సిన సేవలను చర్చించారు. కార్యక్రమంలో మానవత బాధ్యులు సురేంద్రరెడ్డి, సాయిరాం, మునిరావు, విశ్వనాథం, మహేశ్వరరెడ్డి, మణి, సుధీర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, మోహన్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

రాయచోటి అర్బన్ : సమస్యల పరిష్కారంలో పాలకులు అనుసరిస్తున్న నిర్లక్ష్య, అలసత్వ వైఖరిని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాయచోటి కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో బస్సుయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆయన సీపీఐ నేతలతో కలసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విభజన హామీలను వెంటనే అమలుపర్చాలని, కేంద్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని చేపడుతున్న రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్రలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జక్కల వెంకటేషు, మర్రి సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ఆయుధంలాంటిది

గుర్రంకొండ: విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ అనేవి ఆయుధాల్లాంటివని మదనపల్లె పోలీస్‌శాఖ మోటివేషన్ స్పీకర్ రామ్మూర్తి అన్నారు. ఆదివారం స్థానిక ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో రీడో సేవాసంస్థ ఆధ్వర్యంలో యువభారత్ ప్రాజెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో నేటి తరం విద్యార్థులకు పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం, చదువుకోవాలనే తపన ఉంటే భవిష్యత్‌లో మంచి ఉన్నతస్థితికి చేరుకొంటారన్నారు. ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. చంద్రయాన్-3 విజయవంతంలో మహిళలు ఎంతో ముఖ్యపాత్ర పోషించారన్నారు. నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు అబూబకర్, అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో భక్తుల సందడి

సంబేపల్లె : మండల పరిధిలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయానికి ఆదివారం వేకువజాము నుంచే భక్తుల తాకిడి మొదలైంది. వేకువజామున అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. దర్శనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఇరుగులమ్మకు పూజలు

సిద్దవటం : మండలంలో మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద కొలువైన ఇరుగులమ్మకు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించినట్లు ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన జరిపామన్నారు. కొందరు భక్తులు అమ్మవారికి మొక్కుబడులను చెల్లించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

విశేష అలంకరణలో లక్కిరెడ్డిపల్లి గంగమ్మ

లక్కిరెడ్డిపల్లి : వర్షాలు కురిపించి ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడు తల్లీ అంటూ ఆదివారం అనంతపురం గంగమ్మకు భక్తులు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మ దేవతకు ఆలయ పూజారులు రెడ్డి శేఖర్, చంద్రశేఖర్‌లు అలంకరించి, విశేష పూజలు జరిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లి : గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



సిద్దవటం: పూజలందుకున్న ఇరుగులమ్మ



సంబేపల్లె: నల్లగంగమ్మ దర్శనం కోసం క్యూ లైన్‌లో వేచివున్న భక్తులు